క్లుప్తంగా

వైభవంగా సీతారాముల వార్షిక కల్యాణం


ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణం

సాలూరు: పట్టణంలోని చాకలివీధిలో గల రామమందిరం వద్ద సీతారాముల వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త కూనిశెట్టి జెట్టిదొర దంపతులు, కుమారుడు లోకేష్ దంపతులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం శాంతి హోమం నిర్వహించారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

పెదపెంకిలో పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో మంగళవారం 650పశువులకు పశువైద్య సిబ్బంది గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే ఆస్కారం ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టినట్లు గణేష్ తెలిపారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకేల ప్రారంభం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయ, ఆర్‌బీకే భవనాలు

సాలూరు: మండలంలోని కొత్తవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర బుధవారం ప్రారంభించనున్నారు. సుమారు రూ.42 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతుభరోసా కేంద్రం గ్రామంలో నిర్మించారు.

నేలకొరిగిన మొక్క జొన్న పంట పరిశీలన


జొన్నకండెలను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలో కురుస్తున్న అకాలవర్షాల కారణంగా నేలమట్టమైన మొక్కజొన్న పంటను ఏఓ ఎస్.అవినాష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లక్ష్మీపురంలో మొక్కజొన్న పంట పాలు పోసుకుంటున్న సమయంలో వీచిన ఈదురుగాలులకు పడి పోవడంతో పంటనష్టం వాటిల్లినట్లు తెలియజేశారు. నేలమట్టమైన జొన్నపంటకు 33 శాతం వరకు నష్టం ఉంటుందన్నారు. అలాగే మండలంలోని 10 మంది రైతులకు సంబంధించిన 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం వాటిల్లిందని అంచనాలు వేసి నివేదిక ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ కిరణ్, జొన్న రైతులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

సీతానగరం: మండలంలోని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసిన పోలీస్ స్టేషన్లలో బుధవారం వేలం వేయనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వాహనాలను కొనుగోలు చేయదలచిన వారు వేలం పాటలో పాల్గొవాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీఓ గీత సూచించారు. స్థానిక కస్పా, కోమటి, కొత్త వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మండల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె అక్కడి లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్యార్థులకు చేస్తున్న విద్యాబోధనపై ఆరాతీశారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలని, చిన్నారుల బరువు, ఎత్తు సరిచూడాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి ఉన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- నియోజకవర్గానికి ఆసరా సాయం రూ.26.45 కోట్లు
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు


నమూనా చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డ్ ఆసరా పథకం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మండల కేంద్రంలోని వెంకంపేటలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడవ విడత రుణ మాఫీ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరాతో అక్కాచెల్లెమ్మలకు జగనన్న అండగా నిలిచారని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గతంలో రెండు విడతలుగా రుణమాఫీ నగదు అందించామని, మూడో విడత సైతం పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళల జీవన ప్రమాణాలు మార్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా మహిళల బకాయిలు రద్దు చేస్తామని చెప్పి మోసం చేశాడని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను రుణ విముక్తులను చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టి, ఇచ్చిన మాట ప్రకారం 2019 ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ వారి తుది జాబితా ప్రకారం 7.98 లక్షల మహిళా సంఘాలలోని 78.94 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఉన్న అప్పు నిల్వ రూ. 25.57 కోట్లను 4 విడతల్లో చెల్లిస్తానని చెప్పి, ఇప్పటి వరకు రెండు విడతలలో రూ.12,75 కోట్లను మహిళా సంఘాల పొదుపు ఖాతాలలో జమచేసినట్లు గుర్తు చేశారు. మాడవ విడతలో భాగంగా పార్వతీపురం నియోజవర్గంలోని 4,428 సంఘాలకు చెందిన మహిళలకు రూ. 26.45 కోట్లను అందజేశారని వివరించారు.

సీఎం జగనన్నకు కృతజ్ఞత తెలియజేయాలి

కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, ఏ ప్రభుత్వంలో దక్కని గౌరవం మన ప్రభుత్వంలో మహిళలకు దక్కుతోందన్నారు. అన్ని పథకాలు కూడా మహిళలు పేరున ఇచ్చి వారు ఆర్థికంగా పరిపుష్టిని సాధించేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందని మహిళలంతా ఈ అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా మెరుగుపడి కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌కి మహిళలంతా కృతజ్ఞతగా ఉంటూ వచ్చే సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని, అందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, మండల వెలుగు సమాఖ్య అధ్యక్షురాలు రేవతమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై తిరుపతిరావు, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాధరావు, పూడి శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, మహిళలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మహిళలు

జీవితాలు మారాయి



నేను, నా భర్త గతంలో కూలి పనులకు వెళ్లేవాళ్లం. ఆ పని చేయలేక ఇబ్బంది పడుతున్న మాకు వైఎస్సార్ రెండవ విడతలో రూ.20 వేలు వచ్చింది. దాంతో పాటు స్త్రీనిధి కింద రూ.30 వేలు రుణం తీసుకుని పాడిపశువు కొనుక్కున్నా. నెలకు రూ.8వేల నుంచి రూ.10 వేల ఆదాయం వస్తోంది. పిల్లలకు అమ్మఒడి వస్తుంది. ఒక్క మాటల్లో చెప్పాలంటే జగనన్న మా జీవితాలను మార్చేశారు. ఆయనకు మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– కస్తూరి బాయి, వీఆర్ పేట, పార్వతీపురం మండలం

ఈ ప్రభుత్వమే కావాలి



పేదల కోసం తపించే ఇటువంటి ప్రభుత్వమే మాకు కావాలి. చెప్పిన ప్రకారం అన్నీ ఇస్తున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలు కూడా జగనన్న కడుతున్నాడు. 2017లో డ్వాక్రాలో చేరాను. తీసుకున్న మొత్తాన్ని కూడా దశలవారీగా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ మరువను.

– కర్రి గౌరమ్మ,
పులి గుమ్మి, పార్వతీపురం మండలం

ఆర్థికంగా ఆదుకుంటున్నారు



మాలాంటి పేదవారిని జగనన్న ఆర్థికంగా ఆదుకుంటున్నారు. మాకు పథకాలు ఎన్నో అందుతున్నాయి. చాలా గొప్ప విషయం. చిన్న సంతోషాలతో సంబర పడిపోయే మాకు జగనన్న ఇస్తున్న కానుకల గురించి ఎంతచెప్పినా తక్కువే.

– మావ్వల పద్మ, బాలగుడబ,
పార్వతీపురం మండలం

జోగింపేట కేజీబీవీలో ప్రవేశాలకు ఆహ్వానం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హరిత

సీతానగరం: మండలంలోని జోగింపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 6వతరగతిలో బాలికల ప్రవేశానికి, 7,8,9. తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ధరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ గొట్టాపు హరిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తులను ఏప్రిల్ 20తేదీ లోగా ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్ బాలికలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు తల్లిదండ్రులు వలస వెళ్లిపోయిన బాలికలు, దారిద్ర్య రేఖకు దిగువన గల బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీ://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపిస్తామని, మెసేజ్ అందిన వారు వారికి కేటాయించిన కేజీబీవీలకు వెళ్లి జాయిన్ కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం మండలాల్లో ఉండే కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రత్యేకాధికారిణులను సంప్రదించాలని స్పెషల్ ఆఫీసర్ హరిత స్పష్టం చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండండి


మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ మధుసూదనరావు, ఏఓ అనురాధ పండా తదితరులు

సాలూరు: వర్ష సూచన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ మధుసూదనరావు సూచించారు. గడిచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట పడిపోయిన శివరాంపురం తదితర గ్రామాల్లో ఏఓ అనురాధ పండాతో కలిసి మంగళవారం ఆయన పర్యటించి పంట నష్టపరిహారాన్ని అంచనావేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బుధవారం వర్షాలు పడే సూచనల నేపథ్యంలో నూర్పిడి చేసిన మొక్కజొన్న గింజలను టార్పాలిన్‌లతో కప్పాలని, కోతకు వచ్చిన పంటను వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొద్ది రోజులు తరువాత కోయాలని సూచించారు.కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

జమ్మిడివలసలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం


గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పి. శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: మండలంలోని జమ్మిడివలస గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ పి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన వయోవృద్ధులు, గర్భిణులు, సుగర్, బీపీ, ఆస్తమా ఫిట్స్ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి కావలసిన మందులు ఇచ్చి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించాలని, ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేంద్రప్రసాద్, 104 సిబ్బంది ఆనందరావు, సంతోష్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతురాలి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట గ్రామానికి చెందిన పెత్రా కృష్ణ, లక్ష్మీల కుమార్తె మౌనిక (17)స్నేహితురాలితో కలిసి బహిర్భూమికి వెళ్లి వస్తున్న సమయంలో సోమవారం రాత్రి పిడుగుపాటు ప్రమాదానికి గుర్తై అకాల మరణం చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జమదాల గ్రామంలో నిర్వహించిన అనంతరం వెంకంపేట గ్రామంలో గల బాధిత కుటుంబ నివాసానికి చేరుకుని మృతురాలి తల్లిదండ్రులను పరామర్శించారు. పరామర్శలో వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తీళ్ల శివున్నాయుడు, వెంపలి గురురాజు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల పఠనాశైలి పరిశీలన


పార్వతీపురంటౌన్: విద్యార్థులు పఠనా శైలిని పెంపొందించుకోవాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ హితవు పలికారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లి ఉన్నత పాఠశాలలను డీఈఓ ఎస్‌డీవీ రమణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల సమయం దగ్గర పడుతోందని, విద్యార్థులంతా పరీక్షలపై దృష్టిసారించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో చొక్కాపు శ్రీనివాసరావు, హరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా ఫేర్‌వెల్ డే


అలరించిన విద్యార్థినుల డ్యాన్స్

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, విద్యార్థినులు నృత్య ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఎంజాయ్‌మెంట్‌తో పాటు చదువు కూడా ఉండాలన్నారు. బాగా చదువుకుని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు.

రైతుల సమక్షంలోనే భూ సరిహద్దుల గుర్తింపు


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాధాకృష్ణ

కొమరాడ: రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులు గుర్తించాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్తాం గ్రామంలో జరిగిన గ్రామసభలో భూముల రీసర్వేపై సమీక్షించారు. సర్వే సక్రమంగా చేయాలని, రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమయ్యేలా సర్వే జరగాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పాలకొండ: మండలంలోని జంపరకోట పంచాయతీ చెత్త సంపద కేంద్రాన్ని డీపీఓ(జిల్లా పంచాయతీ అధికారి) బలివాడ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడికి తరలించి, ఎరువు తయారు చేయాలన్నారు. ఇక్కడ తయారయ్యే సేంద్రియ ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని సిబ్బందిని కోరారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ సత్యం, కార్యదర్శి సరస్వతి ఉన్నారు.

జగనన్న స్వచ్ఛసంకల్పంతోనే మెరుగైన ఆరోగ్యం


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ దేవకుమార్

సీతానగరం: రాష్ట ప్రభుత్వం ప్రతిష్ఠాకరంగా అమలు చేసిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై ప్రజలు, క్లాప్స్ సిబ్బందికి అధికారులు అవగాహన కల్పించాలని డివిజినల్ పంచాయతీ అధికారి అధికారి దేవకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదభోగిలిలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని 6 మండలాల సర్పంచ్‌లు ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులకు చెత్తనుంచి సంపద తయారీ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తనుంచి సంపద తయారీపై దృష్టి సారించి పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టడం వల్ల ప్రజల ఆరోగ్యం కుదుట పడుతుందని అభిప్రాయ పడ్డారు.

వర్మీకంపోస్టుతో ఆదాయ వనరు

గ్రామంలో ప్రతి ఇంటినుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేయాలని సూచించారు. వర్మీ కంపోస్టు తయారు చేయడం ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు పెరుగుతాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.రమణమ్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించడానికి, చెత్తనుంచి సంపదతయారీ శిక్షణ దోహద పడుతుందన్నారు. ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమగ్ర అభివృద్ధి, లక్ష్యాలను సాధించడానికి సిబ్బంది, పంచాయతీ పాలకుల సహకారం అవసరమని కోరారు. ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు. పెదభోగిలి సర్పంచ్ జె. తేరేజమ్మ, ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, ఎంపీటీసీ ఎస్ గౌరి, ఈఓ వెంకటరావు, వివిధగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


జమదాల గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలం జమదాల గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా అని తెలుసుకునేందుకు గ్రామానికి వచ్చానని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ఎంపీపీ సిద్ధా జగన్నాధరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మవారి సిరిమానోత్సవం


ఇళ్లు, పశువుల శాలలపై అక్షింతలు వేస్తున్న సిరిమానుపై అధిష్టించిన పూజారి


అమ్మవారి ఘటాలతో తిరువీధిలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామంలో మంగళవారం పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని సిరిమానోత్సవం వైభవంగా జరిగింది. రథచక్రాలపై ఏర్పాటుచేసిన సిరిమానుపై పూజారి తిరువీధి చేశారు. మేళతాళాలు, అమ్మవారి ఘటాలు పూజారి తిరువీధిలో పాల్గొన్నాయి. బుధవారం ఉదయం అనుపోత్సవం జరగనుంది. గ్రామంలో కిక్కిరిసిన భక్తులతో జాతర సందడి నెలకొంది. జాతర సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై కె నీలకంఠం ఆధ్వర్యంలో సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


వైఎస్ఆర్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల్లో ఒకటైన వైఎస్ఆర్‌టీయూసీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పీవీ రమణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు వైఎస్ఆర్‌టీయూసీ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ టీయూసీ బలోపేతం కావాల్సిన ఆవశ్యకతను, తద్వారా సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాల పెరుగుదలతో పాటు సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్వర్ణాంధ్రప్రదేశ్ స్వప్నం సాకారమయ్యేలా, అందరూ భాగస్వామ్యులవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకురాలు శోభా హైమావతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు గుర్రాజు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రాకపోకల సమస్యకు చెక్

- ప్రారంభమైన చినభోగిలి, మక్కువ రోడ్డు అభివృద్ధి


జరుగుతున్న రోడ్డు పనులు

సీతానగరం: విశాఖ–రాయగడ రాష్ట్ర హైవే రోడ్డులో చినభోగిలి జంక్షన్ నుంచి మక్కువ వరకూ రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టడంతో రాకపోకల సమస్య త్వరలో తీరనుంది. ఈ మేరకు బొబ్బిలి శ్రీనివాసా కనస్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో రోడ్డు అభివృద్ధి పనులు మంగళవారం చేపట్టారు. రోడ్డు పనుల విషయమై ఆర్అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు మాట్లాడుతూ రూ.30 కోట్లతో చినబోగిలి-మక్కువ వరకూ ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ లైన్ బీటీరోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయన్నారు. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల సూచనల మేరకు రోడ్డుకు 30 పైప్ కల్వర్టులు, ఒక శ్లాబ్ కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.